క్లుప్తంగా

అధినేత జగన్‌తో వాసుపల్లి భేటీ



పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: కూటమి అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఒక్కటంటే ఒక్క హామీ కూడా అమలు చేయకుండా యువత, నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాలను చంద్రబాబు అండ్ కో మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లి గూడెంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి వెనుకబడిందని చెప్పారు. తల్లికి వందనం తొలి ఏడాది ఎగ్గొట్టి.. రెండో ఏడాది రూ.2వేల కోత విధించి అరకొరగా వేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేశారని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కరోనా సమయంలో కూడా ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. విశాఖలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ చెన్నా



కమిషనర్‌కు బొకే అందజేస్తున్న చెన్నా

డాబాగార్డెన్స్: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్‌ను జీవీఎంసీ 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు



సాయి దర్బార్‌లో వెలసిన వారాహి, రాజశ్యామల అమ్మవార్లు

అల్లిపురం: శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో గురువారం నుంచి వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు) జూలై 24 వరకు నిర్వహించనున్నట్లు సాయి దర్బార్ నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. దీంట్లో భాగంగా మొదటి రోజు ఉన్మత్త వారాహి, రెండవ రోజు బృహత్ వారాహి, మూడవ రోజు స్వప్న వారాహి, నాల్గవ రోజు కిరాత వారాహి, ఐదవ రోజు శ్వేత వారాహి, ఆరవ రోజు ధూమ్ర వారాహి, ఏడవ రోజు మహా వారాహి, ఎనిమిదవ రోజు వార్తాలి వారాహి, తొమ్మిదవ రోజు దండిని వారాహి, పదవ రోజు ఆది వారాహి మాతగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా దేవాలయంలో సంప్రదించాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు

కంచరపాలెం: సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. 54వ వార్డు 104 ఏరియా జ్యోతినగర్ సచివాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్మికులకు ఇంకా జీతాలు ఇవ్వక పోవడంపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. జోన్ నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, ఎం. నూకరాజు, రాయప్పుడు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిత్తడే

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- డ్రైయిన్లు పొంగి రోడ్లపైకి మురుగు నీరు
- ప్రమాదాలకు నిలయంగా వర్షపు నీటి గుంతలు
- వర్షాకాలంలో దక్షిణలో భయం భయం



రాజారామ్మోహన్ రాయ్ రోడ్డులో ఇలా..



బౌడారా రోడ్డులో రోడ్డుపైకి పొంగుతున్న మురుగు నీరు



బౌదరారోడ్డు శివాలయం ఎదురుగా పరిస్థితి ఇదీ..



చావుల మదుం జంక్షన్ నుంచి నగరంలోకి వచ్చే మెయిన్ రోడ్డు ఇలా..

డాబాగార్డెన్స్: చినుకు పడితే చాలు దక్షిణ నియోజకవర్గం చిత్తడి.. చిత్తడిగా మారుతుంది. కొద్దిపాటి వర్షానికి కూడా రోడ్లు, కాలువలు వాగులను తలపిస్తాయి. యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) నీరు కూడా వీటిలో కలవడం వల్ల స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో డ్రైన్లు పొంగకుండా సిల్టు తొలగించాలని జీవీఎంసీ పక్షం రోజుల కిందటే ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ ఆచరణ మాత్రం తూతూ మంత్రంగా సాగుతోంది. ఈ సమస్యలపై పలుమార్లు జీవీఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఎక్కడ చూసినా గతుకుల రోడ్లే..

నియోజకవర్గ పరిధి బౌడారా రోడ్డు, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ, అల్లిపురం ఇలా ఎన్నో ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతల మయమయ్యాయి. నెల.. నెలన్నర కిందట వేసిన రోడ్లు, ప్యాచ్ వర్కుల్లో నాణ్యతా లోపం కారణంగా చిన్న పాటి వర్షానికే పాడయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లు చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులన్నీ నాణ్యతా లోపం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

కింద పడితే అంతే..

నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉంటోంది. పగటి పూటే ఆ గుంతల్లో పడి పలువురు ప్రమాదాలకు గురవుతుండగా, రాత్రి వేళల్లో పరిస్థితి ఏ మేరకు ఉంటుందోనన్న భయం ద్విచక్ర వాహన చోదకులకు పట్టుకుంది.

పట్టించుకున్న నాథుడేడి?



చిన్నపాటి వర్షానికే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే ఒక మోస్తరు వర్షం కురిస్తే ఇంకెలా ఉంటుందో అని అంతా ఆందోళన చెందుతున్నారు. నాణ్యతా లోపంతో అరకొరగా రోడ్లు వేస్తే పరిస్థితి ఇలాగే ఉంటుంది. చేపట్టిన పనిలో పర్యవేక్షణ లేకపోతే ఎలా?

– నాగ అరుణ్‌కుమార్, ద్విచక్ర వాహన చోదకుడు

కనీసం రోడ్లు వేయలేని దుస్థితి..



కూటమి పాలన ఏర్పడి ఏడాదైంది. అయినా కనీసం రోడ్లు కూడా సరిగ్గా వేయించలేకపోయారు. మరేం పాలిస్తారో? వర్షానికి ఏర్పడ్డ గుంతల్లో ఎవరైనా పడి ప్రమాదానికి గురైతే అందుకు బాధ్యులెవరు? ఇప్పటికైనా శిథిలమైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయాలి.

–సారిక దైవకుమార్, ఆశిపావీధి

వర్షమొస్తే కేజీహెచ్‌లో అవస్థలే..



వర్షంతో చంటి పిల్లలతో కేజీహెచ్‌కు వచ్చిన మహిళలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో వర్షం కురిస్తే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి రోగులు అవస్థల పాలయ్యారు. వర్షం కురిస్తే ఉండడానికి షెల్టర్లు కూడా లేవు. దీంతో రోగులు వర్షంలో తడుస్తూ వేచి ఉన్నారు. అలాగే రోగుల సహాయకులు కూడా తడిసిపోయారు. కొంత మంది గొడుగులు తెచ్చుకుని తాత్కాలిక ఉపశమనం పొందారు. కొందరు పిల్లలు, వృద్ధులతో వచ్చి ఇబ్బందులకు గురయ్యారు.

జిల్లా జడ్జిని కలిసిన జీవీఎంసీ కమిషనర్



జిల్లా జడ్జిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా న్యాయమూర్తి చిన్నమశెట్టి రాజును జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయమూర్తి కార్యాలయ చాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎంసీకి సంబంధించి న్యాయపరమైన అంశాలు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తిని కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు.

ఏయూను సందర్శించిన జపాన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీని బుధవారం జపాన్ దేశానికి చెందిన జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విద్యార్థులకు ఉపయుక్తంగా, లబ్ధి చేకూరేలా ఉండే నూతన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే దిశగా చర్చలు సాగించారు. వీసీ రాజశేఖర్ జెట్రో సంస్థ ప్రతినిధులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో జెట్రో తోయమ చిప్ తమురా కెన్, సీనియర్ డైరెక్టర్ జుంకి యమాపిట, డైరెక్టర్ జనరల్ కావోరు శిరయిపి, అసిస్టెంట్ డైరెక్టర్ వీర బాబు వీర్ల, డీన్ బెట్రీట్ ఆచార్య కె.రమాసుధ, రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు



టౌన్ కొత్తరోడ్డు వద్ద మురుగు కాలువను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జగన్నాథ స్వామి రథయాత్ర నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపరచాలనీ జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. బుధవారం టౌన్ కొత్తరోడ్డు నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు రహదారులు, కాలువలు, కల్వర్టులు, చెత్త కుండీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు, కాలువలు, కల్వర్టులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి బ్లీచింగ్ చల్లాలని, యాంటీ లార్వా ఆపరేషన్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేష్, ఇంజినీరింగ్ ఏఈ షమీం, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కూల్' విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలివ్వాలి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినపత్రం అందిస్తున్న దళిత హక్కుల సంఘం నాయకులు

ఆరిలోవ: బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం ఇవ్వాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం డీఈవో కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో తమ పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని, యూనిఫారం, పుస్తకాలు అందజేయాలని నినాదాలు చేశారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కొనసాగించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో 10 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయిలు ఉండటంతో పాఠశాలల యాజమాన్యాలు ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు ఆయా సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. అనంతరం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై డీఈవో స్పందించి నగరంలోని భాష్యం, చలపతి తదితర స్కూళ్ల ప్రిన్సిపాళ్లను కార్యాలయానికి పిలిపించి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద పుస్తకాలు, యూనిఫారం అందించాలని ఆదేశించారు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న మోదీ పాలన

- సెమినార్‌లో పలువురు వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

డాబాగార్డెన్స్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీకి సరిగ్గా 50 ఏళ్లు పూర్తయ్యాయని, నాటి ఎమర్జెన్సీని తలపించే విధంగా నేడు మోదీ నాయకత్వంలో కేంద్ర బీజేపీ పాలన ఉందని సీపీఎం నాయకుడు సీహెచ్ నరసింగరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం ఉద్ఘాటించారు. 50 ఏళ్ల ఎమర్జెన్సీ 'నేటి నయా ఫాసిస్ట్ ప్రభావం' పేరిట డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం విశాఖ జిల్లా కమిటీ సదస్సు నిర్వహించింది. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో నర్సింగరావు, లోకనాథం మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1975 జూన్ 25 చీకటి అధ్యాయమన్నారు. 1960లో అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్షాల కూటములు విజయాలు సాధించి, కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. అందుకు ప్రతిస్పందనగా ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయీకరణ, రాజ భరణాల రద్దు వంటి నినాదాల పరంపరతో తన స్థానాన్ని పున:స్థాపించుకున్నారన్నారు. నిరుద్యోగం, అసమానతలు భారీగా పెరగడం, ఎన్నికల్లో రిగ్గింగుకు పాల్పడడంతో ప్రజల తిరుగుబాటును ఎదుర్కొనలేక ఎమర్జెన్సీ విధించి, రాజకీయ ప్రత్యర్థులను జైల్లో పెట్టడం, పత్రికలపై సెన్సార్ విధించడం, పాత్రికేయులు, ప్రధానంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలను జైళ్ల పాల్జేయడం వంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. విశాఖపట్నంలో నర్సింగరావు విద్యార్థి ఉద్యమ నాయకుడిగా ఉంటూ ఎమర్జెన్సీ కాలాన్ని ఎలా ఎదుర్కొన్నారో ఆయన అనుభవాలను వివరించారు. ఎమర్జెన్సీ కంటే నేడు మోదీ పాలన అత్యంత క్రూరంగా ఉందన్నారు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేయడంతో పాటు కార్మిక హక్కులు కాలరాయడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు వివరించారు. హిందూత్వ కార్పొరేట్ కలయికతో దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. సదస్సులో సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.సుధాకర్, రాధాకృష్ణ, కేఎం కుమారమంగళం తదితరులు పాల్గొని అనుభవాలు వివరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, అధిక సంఖ్యలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత కుటుంబ సభ్యుల అన్నదానం



అన్నదానం చేస్తున్న కాశీ నిత్యాన్నదాత కుటుంబ సభ్యులు

డాబాగార్డెన్స్: కాశీ పుణ్యక్షేత్రంలో హనుమాన్ ఘాట్ వద్ద క్షత్రియ సేవా సంఘం సభ్యులు, కాశీ పుణ్యక్షేత్రంలో ఉచితంగా నిత్యాన్నదానం చేస్తున్న శ్రీరామరాజు కుటుంబ సభ్యులు రాధిక, సాయి హేమంత్ ధనుష్‌వర్మ, గౌతమ్ బుధవారం పాతనగరంలోని స్వామి వివేకానంద ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాశీలో ప్రతిరోజూ అన్నదానం చేస్తున్న రామరాజు, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని వివేకానంద సంస్థ సభ్యులు ప్రార్థన చేశారు.

'అపోలో'లో క్యాన్సర్ విజేతల 'కెన్‌విన్' గ్రూప్



క్యాన్సర్ విజేతలతో ఆంకాలజీ వైద్యులు

ఆరిలోవ: అపోలో హాస్పిటల్ ఆంకాలజీ విభాగంలో బుధవారం క్యాన్సర్ విజేతలతో మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంకాలజీ విభాగం వైద్యులు కెన్‌విన్ గ్రూప్ ప్రారంభించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ఈ గ్రూప్‌లో క్యాన్సర్ విజేతలు వారి అనుభవాలు, కథల గురించి వెల్లడిస్తారని తెలిపారు. వైద్యులు క్యాన్సర్‌కు సంబంధించిన సలహాలు, సూచనలిస్తున్నారన్నారు. ఈ గ్రూప్‌లో క్యాన్సర్ విజేతలతో పాటు క్యాన్సర్‌కు గురై చికిత్స పొందుతున్న వారు, అనుమానితులు కూడా ఉంటారన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, క్యాన్సర్ రోగులు ధైర్యంగా ఉండాలని, వైద్యులకు సహకరించాలని సూచించారు. అలాంటప్పుడే రోగులు తొందరగా కోలుకుని క్యాన్సర్‌ను జయించగలుగుతారన్నారు. సమావేశంలో అపోలో ఆంకాలజీ వైద్యులు డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ వి.ప్రదీప, డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ బ్రహ్మాజినాయుడు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మద్దిలపాలెం: యువత మాదవ ద్రవ్యాలకు దూరంగా.. ఉజ్వల భవితకు బాటలు వేసే విద్యకు దగ్గరగా ఉండాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు బుధవారం కృష్ణా కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 15 రోజులుగా కళాశాల విద్యార్థులకు సెమినార్, పోస్టర్ పెయింటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ మాదక ద్రవ్యాల వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుని వాటికి బానిసలుగా మారిపోవడం వల్ల యువత భవిష్యత్ చిత్తవుతుందన్నారు. యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు ఉన్నత భారత అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.రామారావు, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

యూజీడీతో అవస్థలు

బాగు చేయాలంటూ కొబ్బరితోట వాసుల వినతి



యూజీడీ సమస్యను కార్పొరేటర్ పద్మావతికి వివరిస్తున్న కొబ్బరితోట స్థానికులు

అల్లిపురం: అసలే వర్షాలు.. ఆపై యూజీడీ పొంగి మురుగుతో అవస్థలు పడుతున్నామంటూ కొబ్బరితోట వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు ఉబికి పరిసర ప్రాంతాలు దుర్వాసనతో నిండిపోయాయని, ఇళ్లలోకి పురుగులు వస్తున్నాయని కొబ్బరితోట వాసులు 34వ వార్డు కార్పొరేటర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో ఆమె బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూజీడీ పైపులు పగిలిపోవటంతో ఈ సమస్య ఏర్పడిందని, ఇప్పటికే కౌన్సిల్‌లో ఈ విషయం చర్చించినట్లు ఆమె వారికి వివరించారు. జోనల్ కమిషనర్‌కు తెలియజేశామని, టెండర్లు ప్రతిపాదించాల్సి ఉందని వారికి వివరించారు. సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

సమగ్ర చట్టంతోనే ముఠా కార్మికులకు న్యాయం



మాట్లాడుతున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో వివిధ షాపులు, గొడౌన్లలో పని చేస్తున్న ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు డిమాండ్ చేశారు. జగదాంబ జంక్షన్‌లోని సిటు కార్యాలయంలో బుధవారం ముఠా వర్కర్స్ సీనియర్ 10వ మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిటు పతాకాన్ని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై.రాజు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రతినిధుల సభలో గత మూడేళ్ల కాలంలో యూనియన్ చేపట్టిన కార్యక్రమాల రిపోర్ట్‌ను కార్యదర్శి ప్రవేశపెట్టారు. సభ్యులు దానిపై చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ముఠా కార్మికుల ఉపాధికి రక్షణ లేకుండా పోతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ముఠా కార్మికులకు లోడింగ్, అన్‌లోడింగ్ కూలీ రేట్లు పెంచాలన్నారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగే విధంగా కార్మిక చట్టాలు మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకు వచ్చిందన్నారు. వాటిని రద్దు చేయాలని కోరుతూ వచ్చే నెల 9న దేశ వ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరగనుందని, ముఠా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాబోవు మూడేళ్లకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా వై.రాజు, అధ్యక్షుడిగా టి.పైడిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుబ్బారావుతో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

న్యాయం చేయాలంటూ ఎంటీఎస్ టీచర్ల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

టీచర్స్ రోడ్డు: మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులకు న్యాయం చేసి.. 'నియర్ బై రెసిడెన్సీ' జీవోను కొనసాగించాలని పీఆర్‌టీయూ ప్రతినిధులు గోపీనాథ్, నాగేశ్వరరావు, వెంకటపతి రాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎంటీఎస్ ఉపాధ్యాయులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ధర్నాలో పీఆర్‌టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ 2025 బదిలీల్లో 2008, 1998 ఎంటీఎస్ టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా మైదాన ప్రాంతంలోని అన్ని క్లస్టర్ పోస్టులను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలో మొత్తం 184 మంది 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఉన్నారని, అందులో 84 మంది పురుషులు, 100 మంది మహిళలు ఉన్నారని వివరించారు. అలాగే జిల్లాలో మొత్తం 245 మంది 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల్లో 185 మంది పురుషులు, 60 మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు. ప్రతి మండలంలో ఉన్న సింగిల్ టీచర్ పాఠశాలలో ఒక ఎంటీఎస్ టీచర్‌ను సర్దుబాటు చేయాలని సూచించారు. మైదాన ప్రాంతంలోని ప్రతి మండలంలో నూతనంగా రూపొందించిన మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఒక ఎంటీఎస్ టీచర్‌ను సర్దుబాటు చేయాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యలు తప్ప ప్రయోజనం లేదు

రిలే నిరాహార దీక్షను ఆపివేయాల్సిందిగా రెండో పట్టణ సీఐ ఎర్రం నాయుడు ఉపాధ్యాయులను కోరారు. ఇక్కడ ధర్నా చేయడం వల్ల ప్రయోజనం ఏంటని, బందోబస్తు సమస్య వస్తోందన్నారు. అయితే తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన చేపడతామని టీచర్లు స్పష్టం చేశారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం: అమావాస్య సందర్భంగా బుధవారం 15వ వార్డు కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో కొలువైన కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అరవెల్లి ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మ భక్తుల పేరిట ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకట రమణారెడ్డి, అధ్యక్షుడు ఆదారి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.